క్లుప్తంగా

స్వచ్ఛ తాగునీరు సరఫరాకు కృషి

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్



బాపట్లఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సి.హెచ్.విద్యాసాగర్ తెలిపారు. పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన డీఈఈ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. కొత్త కార్యాలయానికి డీఈఈగా విజయ్‌కుమార్‌ను నియమించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ స్వచ్ఛ తాగునీటిని అందించాలన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో జరుగుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఈ మంజూర్‌బాషా, అశ్విని సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



పేరలి(కర్లపాలెం): మహిళలు చేతివృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీపీ యారం వనజ తెలిపారు. పేరలి గ్రామంలో సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్లు, అల్లికలపై జరిగిన శిక్షణ బుధవారం ముగియటంతో ఎంపీపీ యారం వనజ, ఎంపీడీఓ ఎలీషాబాబు శిక్షణ తీసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు నేర్చుకున్న టైలరింగ్, అల్లికల ద్వారా ఉపాధి పొందాలని సూచించారు. ఎంపీడీఓ ఎలీషాబాబు మాట్లాడుతూ మహిళలు సంఘాలుగా ఏర్పడి బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని కుటీర పరిశ్రమలు స్థాపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిఫార్డ్ సంస్థ డైరెక్టర్ ప్రదీప్, సిబ్బంది అవినాష్, నాగరాజు, ప్రభాకరరావు, నాగేంద్రం, లూథరన్ చర్చ్ పాస్టర్ బాబూరావు, లెఫ్టినెంట్ ఆఫీసర్ మరియమ్మ, మహిళలు పాల్గొన్నారు.

వంద రోజుల ఉపాధి కల్పనే లక్ష్యం



కాకుమాను: మండలంలో ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా కృషి చేయాలని ఏపీడీ శివన్నారాయణ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. శివన్నారాయణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఈటీపీఆర్ధీ నాగానంద్, ఏపీఓ సింగారావు, టెక్నికల్ అసిస్టెంట్‌లు రామకృష్ణ, నజీర్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రక్తసేకరణలో జాగ్రత్తలు ముఖ్యం



తెనాలిఅర్బన్: రక్త సేకరణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి ఇన్‌చార్జి మలేరియా సహాయ అధికారి వంగల పున్నారెడ్డి సూచించారు. తెనాలి పట్టణ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే ల్యాబ్ టెక్నిషియన్‌లతో బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని మలేరియా కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రక్త సేకరణ, వాటిని పరీక్షించే, భద్రపరిచే విధానంపై వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

లిక్కర్ విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన పేటేరు గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఈబీ ఇన్‌చార్జ్ సీఐ డి.శ్రీనివాసరావు కథనం మేరకు పేటేరు గ్రామంలో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడులలో గ్రామానికి చెందిన మోర్ల ఏడుకొండలు అనే వ్యక్తి మద్యంను అక్రమంగా విక్రయిస్తూ పట్టుపడ్డాడు. అతని వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసరావు వివరించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్లటౌన్: చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన చీరాల హంటర్స్ తైక్వాండో అకాడమీ చిన్నారులను బుధవారం కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ కె.విజయకృష్ణన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. పట్టుదలతో పోరాడినప్పుడే విజయాన్ని సాధించగలమని పేర్కొన్నారు. పతకాలు సాధించిన వారిలో సీనియర్ విభాగంలో గూడూరు శాంతి వరప్రసాద్, జూనియర్ విభాగంలో ఎం.కల్వర్‌గిరి, జి.కుమార్ రవి, సబ్ జూనియర్ విభాగంలో కె.శ్రీరామ్, ఎస్‌కే జబ్బీర్ రజత పతకాలు సాధించారు.



తైక్వాండోలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రణాళికాబద్ధంగా చదివితేనే లక్ష్యసాధన

చెరుకుపల్లి: ప్రభుత్వ కొలువు సాధించేందుకు అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని ఎస్సై డి.వెంకట కొండారెడ్డి పేర్కొన్నారు. ఎంఎస్ఆర్ స్టడీ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ, అఖిల భారత ప్రజాతంత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష రాసే అభ్యర్థులకు బుధవారం మోడల్ పరీక్ష నిర్వహించారు. ప్రశ్న పత్రాలను ఎస్సై ఆవిష్కరించారు. మోడల్ పరీక్ష అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ అభ్యర్థులు పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా నాయకులు కె.శరత్, ఎంఎస్ఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ చెన్నుపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సుమారు 200 మందికిపైగా అభ్యర్థులు మోడల్ పరీక్ష రాశారు.



పోలీస్ కానిస్టేబుల్ మోడల్ పరీక్ష ప్రశ్నపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్ఐ కొండారెడ్డి

గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

రేపల్లె రూరల్: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ మల్లికార్జునరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయి పాలకులతో కలిసి అధికారులు గ్రామాలలో అవసరమైన మౌలికసదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణులకు త్వరితగతిన పౌరసేవలు అందించే ఉద్దేశ్యంతో నెలకొల్పిన సచివాలయాల ఆశయాలు నూరుశాతం సాధించేలా సచివాలయ సిబ్బంది పని చేయాలని కోరారు. సచివాలయాల పరిధిలోని ప్రజలు పౌరసేవల్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను వివరించాలని సూచించారు. వలసలు నివారించేందుకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మండలంలోని వివిధ గ్రామాలలో 1,066 పనులు గుర్తించినట్లు వెల్లడించారు. ఆయా పనుల కోసం రూ.8.10కోట్లతో అంచనాలు తయారు చేశామన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు రావు నెహ్రూ లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మల్లికార్జునరావు

మండల అభివృద్ధికి కృషి చేయాలి

కర్లపాలెం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ ఎ.ఎలీషాబాబు తెలిపారు. బుధవారం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలయ్యేలా అందరూ కృషి చేయాలని చెప్పారు. ఎంపీపీ యారం వనజ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అధికారులు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ టీడీపీ ఎంపీటీసీ సభ్యునికీ నిధులు కేటాయించాలని ఎంపీడీఓను కోరారు. రైతుల ధాన్యాన్ని ఆర్‌బీకేల్లోనే విక్రయించేలా చర్యలు చేపట్టాలని, ఈ మేరకు కర్షకులకు అవగాహన కల్పించాలని ఏవో సుమంత్‌కుమార్ సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దిలీప్ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే చేపట్టాలని, ఇప్పటికే చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని ప్రజాప్రతినిధులను కోరారు. హౌసింగ్ ఏఈ అన్వర్‌బాషా మాట్లాడుతూ జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, సర్పంచ్‌లు ఎస్‌కె మస్తాన్‌బీ, అక్కల శ్రీనివాసరెడ్డి, కాగిత కరుణకుమారి, ఆట్ల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు కె.హైమావతి, డి.లక్ష్మీ సామ్రాజ్యం, జి.కమలమ్మ, వై. నవనీతమ్మ, ఎస్‌కె ఆసిఫ్ అలీ, టి.నాగలక్ష్మి, టి.సాంబశివరావు, పి.సుబ్బారెడ్డి, ఆర్.లక్ష్మణరావు, కోఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్ పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎలీషాబాబు

భరతమాతకు ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంచుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ రేపల్లె సబ్‌డివిజన్ కన్వీనర్ జంగం శ్యాంప్రసాద్ అన్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలలో భాగంగా మండలంలోని కామరాజుగడ్డ పంచాయతీలోని శ్రీసీతారామ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26 వరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన దేశభక్తి ప్రచార కార్యక్రమాలు నిర్వహించటంతోపాటు భారతమాతకు పూజలు చేస్తామన్నారు. తొలుత భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కో–కన్వీనర్ గూడవల్లి కుటుంబరావు, ఉయ్యూరు వెంకట రాంబాబు, రిటైర్డ్ హెచ్ఎం కొల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అద్దేపల్లి రాఘవులు, మహిళా కన్వీనర్ లంకా కృష్ణకుమారి, ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



భారతమాతకు పూజలు నిర్వహిస్తున్న సమరత సేవా ఫౌండేషన్ సభ్యులు

బేతపూడి సచివాలయంలో అగ్నిప్రమాదం



అగ్నికి ఆహుతైన సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎల్‌పీఓ శరత్‌బాబు

- దగ్ధమైన ఫర్నిచర్, కంప్యూటర్లు
- రూ.5.15 లక్షల ఆస్తినష్టం

బాపట్లఅర్బన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గ్రామ సచివాలయంలోని ఫర్నిచర్ దగ్ధమైన ఘటన బుధవారం మండలంలోని బేతపూడిలో జరిగింది. సచివాలయంలోని ఇన్వర్టర్ బ్యాటరీ పేలి ప్రమాదం సంభవించింది. గమనించిన స్థానికులు సచివాలయ సిబ్బందికి, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న చీరాల ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. సచివాలయాన్ని సందర్శించిన ఇన్‌చార్జి డీఎల్‌పీవో శరత్‌బాబు మాట్లాడుతూ సచివాలయంలోని రికార్డులు ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకున్న కాగితాలు దగ్ధమయ్యాయని పేర్కొన్నారు. వీటితోపాటు రూ.5.15 లక్షల విలువచేసే ఫర్నిచర్, కంప్యూటర్లు అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు.



సచివాలయంలో దగ్ధమైన ఫర్నిచర్

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పెరవలి(వేమూరు): జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించాలని బాపట్ల జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్ తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో బుధవారం జగనన్న కాలనీ లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం డ్వాక్రా సంఘాల ద్వారా రూ.35వేల రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు వివరించారు. లబ్ధిదారులు తక్షణం ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో వేమూరు నియోజకవర్గం వెనుకబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేమూరు డివిజన్ గృహ నిర్మాణ అధికారి రవికుమార్, ప్రేమ చంద్, పంచాయతీ కార్యదర్శి ప్రభు పాల్గొన్నారు.



పెరవలి జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రసాద్

చందోలు బండ్లమ్మ ఆలయ భూమి సర్వే

పిట్టలవానిపాలెం: చందోలు శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానం స్థలాన్ని మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ బుధవారం సర్వే చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి మాట్లాడుతూ దేవస్థాన భూమిని ఆక్రమించిన వారిపై ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టులో 15 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ నేపథ్యంలో అడ్వకేట్ కమిషనర్ జి.అరుణ్‌కుమార్‌ను నియమించినట్లు వివరించారు. ప్రతివాదుల తరుపున ప్లీడర్ గురునాథ సమక్షంలో మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ గ్రామ సచివాలయ సర్వేయర్ జగదీష్ ఎ.భార్గవి, బీఆర్వో అరుణకుమారి సర్వే చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, తుమ్మ జోగేశ్వరరెడ్డి, ఎంపీపీ షేక్ బాజి, బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కినికిచర్ల ప్రసాద్, తదితరులు ఉన్నారు.



సర్వే రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ,అధికారులు

ఫిబ్రవరి 10న కావూరు కళాశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం

చెరుకుపల్లి: కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా మరోమారు ఒకే వేదికపై కలుసుకోనుండడం ఆనందంగా ఉందని పూర్వవిద్యార్థి సంఘ నాయకులు చెప్పారు. గత సంవత్సరం కావూరు ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో ఇప్పటి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు అంతా కలిసి డాక్టస్ సంస్థ అధినేత తుమ్మల రామకృష్ణ ఆధ్వర్యంలో కళాశాల స్వర్ణోత్సవాలు నిర్వహించామని, ఈ ఏడాదీ అంతా కలుసుకునేందుకు ఫిబ్రవరి 10వ తేదీని నిర్ణయించినట్లు వెల్లడించారు. అనుమతి కోసం బుధవారం కళాశాల ప్రిన్సిపల్ దునుమణికి వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. ఈ సమ్మేళనంలో పాల్గొనదలచిన కళాశాల పూర్వ విద్యార్థులు 8919720970, 9849901949 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ నాయకులు పిట్టు శ్రీనివాసరెడ్డి, దివి రాంబాబు, బొనిగల విజయ్‌కుమార్, కాటూరు నాగేశ్వరరావు, విస్సంశెట్టి శ్రీనివాసరావు, పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళన సభకు అనుమతి కోరుతూ ప్రిన్సిపల్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. లైసెన్స్‌లు లేకుండా మైనర్లు ఆటోలు నడుపుతున్న నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎండీ నిసార్ బాషా నేతృత్వంలో నాజ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, హిమని సెంటర్, ఆర్కేటీ, బోసు బొమ్మ సెంటర్‌తో పాటు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ కొనసాగింది. లైసెన్స్‌లు లేకుండా ఆటోలు నడుపుతున్న 60 మందిని గుర్తించి వాటిని సీజ్ చేశారు. దీనితో పాటు ఆటోల్ని అద్దెకు ఇస్తున్న యజమానుల్ని కూడా పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిసార్ బాషా స్పష్టం చేశారు. మరోమారు పునరావృతం అయితే ఆటో యజమానుల పైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోకు రూ. 550 చొప్పున రూ. 33వేలు జరిమానాలు విధించారు.



ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న సీఐ నిసార్ బాషా

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

మంచాల(చేబ్రోలు): రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని పొన్నూరు ఏడీఏ సి.హెచ్.తిరుమలాదేవి చెప్పారు. చేబ్రోలు మండలం మంచాలలో బుధవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఎస్ఎఫ్ఎస్ఎం ద్వారా జిల్లాలో మంచాల గ్రామాన్ని ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. చిరుధాన్యాల పంటల సాగు ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలను చేపట్టామని, జొన్నలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ప్రారంభించామని వివరించారు. అనంతరం స్థానిక ఆర్‌బీకేలో రైతులతో జరిగిన సమావేశంలో ఏడీఏ తిరుమలాదేవి మాట్లాడుతూ పొలంబడి ద్వారా మంచాల గ్రామంలోని క్లస్టర్‌లో 250 ఎకరాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఏవో బి. శ్రీనివాస నాయక్, వీఏఏ కె.రమ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

• అభాగ్యుడికి ఆసరా



గుర్తుతెలియని వృద్ధుడిని 108 అంబులెన్సులో చేర్చుతున్న సేవాసమితి బాధ్యులు

"అన్నీ తీసే(రాసే)సుకుని ఇక అవసరం లేదనుకున్నారో ఏమో.. తమను చక్కగా చదివించి, అన్నీ చూసుకున్న తండ్రిని భారమంటూ, మాకొద్దంటూ రోడ్డున పడేశారు కర్కశ పిల్లలు. మంచి భవిష్యత్తు అనే పూలపాన్పుపై వారిని నడిపిస్తే, తీరా తాను కాలు మోపేందుకు స్థలమంటూ లేకుండా చేశారే అంటున్న ఆ వృద్ధ తండ్రి హృదయ ఘోష దాహంతో తడారిపోయిన పెదవుల నుంచి బయటకు రాలేకపోయింది. చెడిపోయి, కంపుకొట్టే మనస్తత్వాలు కలిగిన మనుషుల కంటే మరుగుదొడ్ల దుర్గంధమే హాయిగా అనిపించిందేమో కదలక, మెదలక అలాగే పడుకుండిపోయాడు."

స్థానిక రైల్వేస్టేషను ఎదురుగా గల మరుగుదొడ్ల దగ్గర రెండురోజుల క్రితం ఎవరో వదిలివెళ్లిన సుమారు 70 ఏళ్ల వృద్ధుడు రోడ్డుపక్కనే నిస్సహాయుడిగా ఉండిపోయాడు. సేవాసమితి సభ్యుడు పోతురాజు ఆ వృద్ధుడికి రెండురోజులుగా ఆహారం అందిస్తున్నారు. అలాగే వదిలేస్తే ప్రమాదమని భావించిన సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను 108 అంబులెన్స్ వాహనాన్ని రప్పించి, బుధవారం తెనాలి ఆసుపత్రిలో చేర్పించారు. – తెనాలి

అత్యవసర వైద్య సేవలపై అవగాహన

మంగళగిరి: చినకాకాని ఎన్నారై వైద్యశాల క్రిటికల్ కేర్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ షేక్ ఆరిఫ్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం అత్యవసర వైద్య సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ స్థాయి సంగ్రహ–2023 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య విభాగం అత్యంత ప్రతిష్టాత్మకమైనదన్నారు. వైద్య విద్యార్థులకు పలు విభాగాల పట్ల అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పలువురు ఫ్యాకల్టీ వైద్యులు హాజరు కాగా డాక్టర్ ఏహెచ్ చౌదరి, డాక్టర్ మురళీవెంకటేశ్వరరావు, డాక్టర్ మనోజ్, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ సుహాసిని, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.



జాతీయ స్థాయి సంగ్రహ - 2023 కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నగరం: నగరం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నాగుల్‌మీరా చెప్పారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఈ మాట్లాడుతూ రేపల్లె 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి నిజాంపట్నం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

చెరుకుపల్లి మండలంలో..

చెరుకుపల్లి: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ దాసరి శ్యాంసుధాకర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆరుంబాక, చెరుకుపల్లి, గుళ్లపల్లి, కావూరు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

నేడు ఆరేపల్లిలో ప్రత్యేక ఆధార్ క్యాంపు

చెరుకుపల్లి: ఆధార్ కార్డు అప్‌డేట్, తప్పులను సరిచేసుకునేందుకు ప్రత్యేక ఆధార్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆరేపల్లి సచివాలయంలో గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు, సమాచారాన్ని మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

నేటి నుంచి పాఠశాలల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు

భట్టిప్రోలు: జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ అండ్ కమిషనర్ ఆదేశాల మేరకు భట్టిప్రోలు మండలంలోని సచివాలయాల పరిధిలోని పాఠశాలల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు, గ్రామ ప్రజలకు ఆధార్ నమోదు, వేలి ముద్రలు, మొబైల్ నంబర్ల అప్‌డేట్ ఈ క్యాంపుల్లో చేయనున్నట్టు వివరించారు. గురువారం ఐలవరం, ఓలేరు, 20న సూరేపల్లి, గొరిగపూడి, 21న పల్లెకోన, పెదపులివర్రు, 23న కోనేటిపురం, పెదలంక, 24న భట్టిప్రోలు–2 , వెల్లటూరు సచివాలయాల పరిధిలో ఈ క్యాంపులు జరుగుతాయని వెల్లడించారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల దొంగతనాలు జరగడంతో పోలీసులు కొంత మంది అనుమానితులను బుధవారం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తాడేపల్లి పట్టణం, రూరల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ మోటార్లు, నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద కరెంటు, ఇతర సామగ్రి దొంగిలించిన విషయంలో మంగళగిరి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకోగా, వారిలో ముగ్గురు జాతీయ రహదారి వెంబడి కొలనుకొండ వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలో విద్యుత్ పరికరాలు దొంగిలిస్తూ బైక్‌తో సహా పట్టుబడినట్లు తెలుస్తోంది. ఆ ద్విచక్ర వాహనం కూడా వేరే ప్రాంతం నుంచి దొంగిలించి ఇక్కడ దొంగతనానికి ఉపయోగించినట్లు సమాచారం.

22న 'సూర్యచంద్రులు' సంగీత విభావరి



బ్రోచర్ ఆవిష్కరించిన సాయి లక్కరాజు

తెనాలి: స్వర్గీయ ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల వర్ధంతి పురస్కరించుకుని పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో 'సూర్యచంద్రులు' పేరుతో ఈనెల 22న సంగీత విభావరిని నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు చెప్పారు. సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆరోజు సాయంత్రం 5.30 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సంగీత విభావరి ఉంటుందన్నారు. సినీవినీలాకాశంలో సూర్యచంద్రుల వంటి వారు ఎన్టీఆర్, ఏఎన్నార్ అనే భావనతో నిర్వహించే కార్యక్రమంలో ప్రముఖ గాయనీగాయకులు వారి పాటలతో అలరిస్తారని చెప్పారు. సంగీత ప్రియులు జయప్రదం చేయాలని కోరారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ

మంగళగిరి: నగరంలోని ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను కమాండెంట్ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయిప్రసాద్, అసోసియేషన్ సభ్యులు గణపతి, కిరణ్, సీహెచ్‌వీ శేఖర్, కేఎస్ రాజు పాల్గొన్నారు.